# చుట్టపు చూపు

రామారావు బెంగుళూరులో ఒక ప్రభుత్వ సంస్థలో పెద్ద ఉద్యోగి. అతన్ని ఎకౌంట్స్ డిపార్ట్మెంటువారు "నువ్వీ డిసెంబర్‌లో ఎల్టీసీ వాడుకోకపోతే మురిగి పోతుంది సుమా!" అని హెచ్చరించారు. వేసవికాలంలో ఆంధ్రా వెళ్ళేటట్టుండదు కనుక అప్పుడు తప్ప పిల్లలకి సెలవలుండవు కనక హోమ్ టవున్ బ్లాక్‌లో అతను ఎల్టీసి వాడుకోడం తక్కువ. పైగా అసలు హోమ్ టౌన్‌లో ఇప్పుడెవరూ లేరు. ఉన్న ఒక అక్కగారు విజయవాడలో వుంది. అందుకని విజయవాడనే అతను హోమ్ టౌన్‌గా డిక్లేర్ చేశాడు ఈ మధ్య. అక్కగారి కుటుంబాన్ని చూసి కూడా చాలా సంవత్సరాలైంది. ఒకసారి వెళ్ళి చూసి రావచ్చు అని ఎప్రూవల్‌కి టి.ఎ. ఎడ్వాన్సుకి అప్లై చేశాడు.

భార్య సీతతో - చెప్పాడు.

"డి సెంబర్‌లో బెజవాడలో మంచు కురవదేమోకాని ఎండలు మండిపోవు. కనక

వెళ్ళవచ్చు" అంది సీత. ఆమెకి బెంగుళూరు ఎంత అలవాటైపోయిందంటే ఆంధ్రా వేడి అంటే భయపడ్తుంది.

భోజనాల దగ్గర డిసెంబర్ చివరివారంలో బయల్దేరి విజయవాడ వెళ్తున్నట్టు రామారావు ప్రకటించాడు. కూతురు రమ ఉత్సాహంగా "ఎప్పుడు నాన్నగారు?" అంటూ అడిగి మరోసారి చెప్పించుకొంది. రమ తొమ్మిదో క్లాసులో వుంది.

కొడుకు చంద్రశేఖర్ మాత్రం "ఇప్పుడా?" అన్నాడు అయిష్టంగా. అతను పి.యు. మొదటి సంవత్సరంలో ఉన్నాడు. కర్నాటకాలో పి.యు.రెండు సంవత్సరాల చదువు. అది రెండు వేపులా పదునున్న కత్తి. విద్యార్థులు బయాలజీ, మేథమేటిక్స్ రెండూ చదువుతారు. ఇటు మెడిసిన్, అటు ఇంజనీరింగ్ ఎంట్రెన్సులు వ్రాయటానికి వాళ్ళు అర్హులు. కాని చంద్రశేఖర్ బయాలజీని, భాషల్ని అసింటా పెట్టడానికి ఇంజనీరింగ్ ఎడ్మిషన్‌కి అవసరమైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్‌ల మీద దృష్టిని కేంద్రీకరించడానికి నిశ్చయించుకున్నాడు. అతని క్లాసులో తెలివైన పిల్లల్ని గమనిస్తూ తనకు పోటీదారుల వ్యూహ రచనని అనుకరిస్తూ వారిని అధిగమించాలని ప్రయత్నించడం పి.యులో చేరగానే మొదలు పెట్టాడు. ఆ ప్రయత్నంలోనే బ్రిలియంట్ కరెస్పాండెన్సు కోర్సులో చేరాడు జె.ఇ.ఇ. వ్రాయటానికి.

"ఇప్పుడు కాకపోతే మరెప్పుడు వీలవుతుంది? మళ్ళీ హోమ్ టౌన్ ఛాన్స్ వచ్చే సరికి రమ పి.యు.లో వుంటుంది" అన్నాడు రామారావు కొంచెం కినుకతో.

చంద్రశేఖర్ తన మిత్రులకి సీటు వచ్చి తనకి రాకపోతే తల కొట్టేసినట్టుంటుందన్నాడు "పోనీ మీరు ముగ్గురూ వెళ్ళి రండి" అన్నాడు.

"ఇంజనీరింగ్‌లో సీటు నీకు తప్పకుండా వస్తుంది. ఐ.ఐ.టి.ల్లో కాకపోతే కర్నాటకలో వస్తుంది. రాకపోయినా నష్టం లేదు. ప్రపంచంలో అందరూ ఇంజనీర్లు కారు" అన్నాడు రామారావు.

"అందరూ పిల్లల్ని చదువుకోమని కేకలు వేస్తారు. మీరు వాడు చదువుకుంటానంటే కోపం తెచ్చుకొంటున్నారు. ఇంజనీరింగ్ గొప్ప చదువు కాదనుకొంటే మీరెందుకు చదివారుట?" అని అడిగింది సీత చంద్రశేఖర్‌కి వత్తాసు వస్తూ.

"చదివాను కనకే అది గొప్పది కాదని తెలిసిపోయింది. నా బాచ్‌లో హిస్టరీ ఎకనామిక్స్, కామర్సు చదివిన బడుద్ధాయిలు అయ్యేఎస్‌లు ఎమ్బీఎలు పాసయి నాకు రెండింతలు సంపాదిస్తున్నారు. ఏం చదివామన్నది కాదు ఎలా చదివామన్నది ముఖ్యం. అయినా మనం వెళ్ళేది ఓ వారం రోజులు అందులో క్రిస్మస్, ఆదివారం ఉంటాయి, న్యూ ఇయర్ డే వుంటుంధి. పెద్దగా పోయే చదువుండదు" అన్నాడు రామారావు.

శేఖర్ ఆలోచనలో పడ్డాడు. రామారావు ఆ రోజు నించి చుట్టాలింటికి వెళ్తే ఎంత మజాగా వుంటుందో చెప్పడానికి తన చిన్నప్పటి అనుభవాలు రోజూ చెప్పసాగాడు. అందులో

ముఖ్యమైనవి రామారావు తన మేనత్త గారింటికి వెళ్ళటాలు.

రామారావు మేనత్తది కూడా విజయవాడే! ఇప్పుడు మేనత్తా బతికి లేదు. ఆమె భర్తా బతికి లేడు. కూతుర్లు పెళ్ళిళ్ళయి, కొడుకులు ఉద్యోగరీత్యా ఆ ఊరు వదిలిపెట్టేశారు. ఆ రోజుల్లో విజయవాడింకా బెజవాడే! బెజవాడలో గవర్నర్ పేటలో డి.ఎల్. రావు లేన్ నుంచి పక్కవీధి దాకా మేనత్తగారి స్థలమే! ఎంతో వైభవంగా ఉండేది వాళ్ళ ఇల్లు. నాలుగైదు గేదెలు, బాదంచెట్టు, ఒక మట్టిల్లు ఒక ఇటుకల ఇల్లు. ఒకసారి వెళ్ళినప్పుడీ ఇంట్లో వుంటే ఇంకోసారి ఆ ఇంట్లో ఉండేవారు. ఈ వీధిలోకి ఈ ఇంటి గేటు ఆ వీధిలోకి ఆ యింటి గేటు ఉండేవి. మధ్య ఖాళీస్థలంలో బావి, బాదం చెట్టు, గొడ్లశాలలు. పక్కవాళ్ళ డాబాకి వీళ్ళ ఇటుకలింటి డాబాకి దూరం తక్కువ. రెండిళ్ళనూ కలుపుతూ బల్ల చెక్కలుండేవి. ఆ ఇంటి పిల్లలు ఈ ఇంటి పిల్లలు ఆ బల్ల చెక్కల మీద ఆ డాబా మీదా ఈ డాబామీదా కూడా ఆడ్తుండేవాళ్ళు. ఆ బల్ల చెక్క మీద దాటడం రామారావుకొక మరుపురాని థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్. అతనికప్పుడు అయిదేళ్ళున్నాయేమో! పెద్దవాళ్ళు కూడా చూసీ చూడనట్టు ఊరుకొనేవాళ్ళు. కిందపడ్తే? ఏమో! కాని ఎప్పుడూ ఎవరూ పడలేదు. మొదటిసారి రామారావుని వాళ్ళ మేనత్త కొడుకు మూడేళ్లు పెద్దవాడు జాగ్రత్తగా చెయ్యి పట్టుకొని దాటించాడు.

రామారావు వాళ్లు వెళ్ళినప్పుడు అతని మేనత్త ఆర్భాటం చేసేది. హోటల్నుంచి ఇడ్డెన్లు తెప్పించేది.ఇడ్డెనొకటి అర్ధణా ఆ రోజుల్లో ఇళ్ళల్లో బ్రేకుఫాస్టులుండేవి కావు. మగవాళ్ళు తొమ్మిదికల్లా భోంచేసి ఆఫీసులకు వెళ్ళిపోయేవారు. ఇంట్లో ఉన్న పూట మధ్యాహ్నం ఏ జంతికలో అరిసెలో మినపసున్నులో ఇంట్లో వున్నవి తినేవారు. పిల్లలు మూడుపూటలా భోంచేసేవారు. చుట్టాలు వస్తే అయ్యర్ల హోటళ్ళ నుంచి ఉపాహారాలు తెప్పించేవారు. ఉప్మాలాంటిది అయితే ఇంట్లోనే చేసేవారు. ఒకసారి రామారావు వాళ్ళ బావ ఇడ్డెన్లు తీసుకు రావడానికి రామారావుని తోడు తీసుకు వెళ్ళాడు. అక్కడ ఇద్దరికి చెరో అణా ఇడ్డెన్లు తెమ్మని మిగిలినవి పొట్లం కట్టమన్నాడు. హోటల్లో టేబుల్ మీద ఇడ్డెన్లు కొబ్బరి వచ్చడి నంచుకొంటూ తినే అనుభవం రామారావుకదే మొదటిసారి.

భోజనాల దగ్గర రామారావుకో ప్రత్యేక హోదా ఇచ్చేవారు. వాళ్ళింట్లో మధ్య బంగారపు పువ్వున్న ఓ వెండి కంచం ఉండేది. అది చిన్న కంచం. మిగిలిన వెండి కంచాల కన్నా భిన్నంగా, అందంగా ఉండేది. దాన్ని వంతులవారిగా పెట్టుకోవాలి. ఒకసారి రామారావు వెళ్ళినప్పుడు మేనత్త ఆ కంచాన్ని రామారావుకి పెట్టింది. ఆ రోజు ఆ కంచం పెట్టుకొనే వంతు అతని మరదలిది. ఆ పిల్ల ఏడ్చింది.

" రామం చిన్నవాడు కదమ్మా! మనింట్లో కంచం రోజూ ఉంటుంది. వాడు ఎప్పుడో కాని రాడు. రేపు నువ్వు పెట్టుకొందువుగానిలే" అని ఆ పిల్లని ఒప్పించింది. నిజానికాపిల్ల రామం కంటే రెండేళ్ళు చిన్నది. పైగా రామం మూడు నెలలకోసారైనా మేనత్తగారింటికి వెళ్తూ

వుండేవాడు. ఇతని తండ్రి కప్పుడు గుంటూర్లో ఉద్యోగం. అయినా మేనత్త గారింట్లో అతనిది ప్రత్యేక స్థానం.

మేనత్తగారింట్లో బోలెడంత పాడి. ఓ కుండ నిండా చేసిన చల్ల ఉండేది. అందులో వెన్నముద్దలు బంతుల్లా తేలుతూ ఉండేవి. రామారావుకి వాళ్ళ అక్కకి మేనత్త మిగిలిన వాళ్ళకంటే కాస్త పెద్ద వెన్నముద్దలు వేసేది కంచంలో, వాళ్ళెప్పుడో కాని రారు'' అంటూ.

ఒకో సాయంత్రం బాదంచెట్టు కింద కట్టెల-పొయ్యి మీద పెనంపెట్టి చల్లట్లు పోసేది. పిల్లలంతా బాదం ఆకులు కోసుకొని నా ఆకు నీ ఆకు కంటే ఎర్రనిది'' అనో పెద్దది అనో అంటూ చుట్టూ నులక మంచాల మీద కూర్చుని తినేవారు. వేసంకాలం అయితే రాత్రిళ్ళు నక్షత్రాలను చూస్తూ అక్కడే పడుకునేవారు.

రామారావు తండ్రి తన పిల్లల్ని, అక్కగారి పిల్లల్ని సర్కస్‌కో, సినిమాకో తీసుకు వెళ్ళేవాడు. అతని తల్లీ మేనత్తా, కనకదుర్గ గుడికి వెళ్ళేవారు. సాధారణంగా అందరూ నడిచే వెళ్ళేవారు కబుర్లు చెప్పుకొంటూ. తండ్రి ఆట మధ్యలో కాణీ అయిసుఫ్రూట్లు కొని పెట్టేవాడు. ఎర్రనివి, ఆకుపచ్చనివి, ఆరెంజ్‌వి, పసుపు పచ్చనివి ఉండేవి. ఎవరికి కావల్సిన రంగు వాళ్ళు తీసుకునేవాళ్ళు.

రామారావు మేనత్తగారు ఇటుకల ఇల్లు కట్టించుకొన్నప్పుడు కొద్దిగా కలప మిగిలింది. ఆమె భర్త దాంతో చిన్న చిన్న చక్రాలు చేయించి వాటిని తొయ్యడానికి వీలుగా పొడుగు కర్రలని వాటికి మేకులతో బిగింపించి తయారు చేయించాడు. అటువంటి తోపుడు చక్రం రామారావు కోసం దాచి అతని బావలు అతనికిచ్చారు. అందరూ ఆ చక్రాలు దొర్లించుకుంటూ తెల్లవారు ఝామున రోడ్ల మీద పరుగులు తీసేవారు. ఆ సమయంలో రోడ్ల మీద వాహనాలుండేవి కావు.

ఇవన్నీ "ఆ బంగారు రోజులెంత బావుండేవో!" అన్న ధోరణిలో రామారావు పిల్లలకి చెప్తూ "మా రోజుల్లో చుట్టాలు వస్తున్నారన్నా, మనం చుట్టాలింటికి వెళ్తున్నామన్నా చాలా సరదాగా వుండేది. మీకు మీ మేనత్త మొహం, వాళ్ల పిల్లల మొహాలు కూడా సరిగా తెలియవు'' అని ముగించసాగాడు.

శేఖర్, రమ తండ్రి మాటలు వినగా వినగా ఓసారి మేనత్తగారి ఊరు వెళ్ళి వస్తే బావుంటుందన్న అభిప్రాయానికి వచ్చారు. పిల్లల సమ్మతి తెలియగానే అక్క లక్ష్మికి రామారావు ఉత్తరం వ్రాశాడు, తనూ తన కుటుంబం విజయవాడ వద్దామనుకొంటున్నట్టు ఆమెకి ఆ రోజుల్లో తమరాక అసౌకర్యం అయితే తెలియజేయమనీను.

పది రోజులైనా ఆమె వద్ద నుంచి జవాబురాలేదు. "అందరూ మనింటికి అడిగే వస్తున్నారా!" అంది సీత. రామారావు ఆలస్యం అయిన కొద్దీరైళ్ళల్లో రిజర్వేషన్సు ఇబ్బంది కనక టి.ఎ. ఎడ్వాన్సు తీసుకుని రాను పోను బెంగుళూరు నుంచి విజయవాడకి, విజయవాడ నుంచి బెంగుళూరుకి ఎ.సి. స్లీపర్‌లో రిజర్వేషన్లు చేయించుకున్నాడు.

తను రిజర్వేషన్లు చేయించుకున్న తేదీలు తెలియజేస్తూ లక్ష్మికి ఉత్తరం వ్రాశాడు.

ఆమె "మీ రాకకి ఎదురు చూస్తున్నా" అంటూ ఆ ఉత్తరానికి జవాబు ఇచ్చింది.

బయల్దేరే రోజు వచ్చింది. అక్కకి బావకి వాళ్ళ పిల్లలకి కొన్న కానుకలు తీసుకొని రామారావు కుటుంబంతో బయల్దేరాడు. హౌరా మెయిల్ విజయవాడలో ఆరు గంటలకల్లా రామారావు కుటుంబాన్ని దించింది.

"మీ వాళ్ళెవరూ స్టేషన్‌కి రాలేదు" అంది సీత.

"తెలిసిన ఊరు. పైగా మగవాడిని నేనున్నాను కదా! నువ్వూ పిల్లలూ మాత్రమే వచ్చుంటే బావస్టేషన్‌కి వచ్చేవాడు" అన్నాడు రామారావు.

కూలీలు ఎప్పట్లా ఒక్కొక్క శాల్తీ ఒక్కొక్కడు చొప్పున ఎత్తుకున్నారు. "ఇంకా నయం నా హేండ్‌బాగ్ పట్టుకొడానికి మరొకడు వచ్చాడు కాదు" అంది సీత.

సగం ప్రయాణాలు దిగిన ఊళ్ళో దిగగానే జరిగే చిన్న దోపిడీ వల్ల మనస్సును అనాహ్లాదకరంగా మారుస్తాయి. రామారావుకి ఈ విషయం తెలుసు. మొత్తం ఓ ఇరవై రూపాయలు ఎక్కువ ఖర్చు పెట్టడానికి సిద్ధపడితే ఏ బాధా వుండదు. రైళ్ళకి వేలల్లో పోసి పదుల్లో కూలీలకీ రిక్షాలకీ ఇవ్వాల్సి వచ్చేసరికి ఎందుకు బాధపడాలనే ధోరణి అతనిది. రైలువాళ్ళు ఎంత టికెట్టు పెడ్తే అంత పెట్టి కొనుక్కోడంలా! కూలీలు రిక్షావాళ్ళు కూడా రైలు స్టేషన్ వాతావరణంలో వాళ్ళు ఎంత చేప్తే అంతా అనుకొంటారు కాబోలు!

సీతకది శుభ సూచకంగా కనపించలేదు. ఎవరు మొయ్యగల సామాన్లు వాళ్ళు కూలీల దగ్గర్నుంచి లాక్కుని పెట్టా హోల్డాలు మాత్రం కూలీలకి విడిచి పెట్టారు. బేరం పది రూపాయలకి కుదిరింది. బయట రెండు రిక్షాలు బేరం ఆడుకుని పిల్లలిద్దరు ఒక దాంట్లో సీతా రామారావు ఒకదాంట్లో ఎక్కారు. టాపులేని రిక్షాలో ప్రయాణం పిల్లల్ని ఉత్సాహపరిచింది. కాని దారిపొడుగున కూర్చున్న జనాన్ని చూస్తూ 'ఛీ' అనుకొన్నారు. "ఈ విజయవాడ ఏం బాగు లేదు" అనుకొన్నారు.

రిక్షాలు మొగల్రాజపురంలో వున్న ఓ పెక్కంతస్థుల ఇంటి ముందు ఆగాయి. లక్ష్మీ వాళ్ల ఫ్లాట్ రెండో అంతస్థులో వుంది. ఈ ఇంటికి లిఫ్టు లేదు. ఆ ఫ్లాట్‌కి సామాన్లు రిక్షావాళ్ళ సహాయంతో చేరవేశారు.

"బెంగుళూరులో అయితే లిఫ్టులుంటాయి" అన్నాడు శేఖర్.

"బెంగుళూరులో కూడా మూడంతస్థుల ఇళ్ళకి లిఫ్టులుండవు. నాలుగో అంతస్థుంటేనే లిఫ్టులుంటాయి" అని రామారావు బెంగుళూరులో అన్నీ మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్‌కి లిఫ్టులుంటాయనే శేఖరభిప్రాయాన్ని సరిదిద్దాడు.

బెల్లు నొక్కాడు రామారావు, రామారవు మేనకోడలు రాణి తలుపు తెరిచింది.

"అమ్మా! మావయ్యావాళ్ళు వచ్చారు" అంటూ లోపలకి కేకపెట్టింది.

రిక్షావాళ్లు హాల్లో సామాన్లు దించి డబ్బు తీసుకుపోయారు.

వంటింట్లోంచి లక్ష్మి పడక గదిలోంచి భర్త సుబ్బారావు వచ్చి పలకరించారు.

"త్వరగా మొహాలు కడుక్కోండి కాఫీలిస్తాను" అంది లక్ష్మి హాలు నుంచి దారి వున్న బాత్‌రూమ్ దాని ముందరే వున్న వాష్ బేసిన్‌లను చూపించింది. కాఫీలు తాగుతుంటే లక్ష్మి చెప్పసాగింది.

"త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ చవగ్గా 3 లక్షలకే వచ్చింది. ఉన్న డబ్బులన్నీ గోక్కుని లోను తీసుకుని బావగారు కొనేశారు. మేము ఫ్లాట్ కొనుక్కున్నాక మీరిదే రావటం" అంది లక్ష్మి.

రామారావు "గృహ ప్రవేశానికి రాలేక పోయాను" అన్నాడు. ఆ సమయంలో అక్కని బావని బట్టలు కొనుక్కోమని డబ్బు పంపి ఊరుకున్నాడు సెలవు పెట్టే వీలు లేక. అది రెండేళ్ళ క్రితం మాట. ఆ సమయానికి లక్ష్మి కొడుకు రాజు నిద్ర లేచాడు. అప్పుడు సీత అందరికీ తాము తెచ్చిన కానుకలు అందించింది.

లక్ష్మి ఆర్భాటంగా ఉపాహారాలు, భోజనాలు తయారుచేసింది. భోజనాలయ్యాక కాస్సేపు విశ్రమించారు.

సాయంత్రం నాలుగు కల్లా అందరూ తయారై బేరేజి చూడటానికి వెళ్ళారు. దానికి ప్రకాశంగారి పేరు పెట్టారు. టంగుటూరి ప్రకాశం ఎవరో రామారావు తన పిల్లలకి చెప్తుంటే రాణి, రాజు కూడా శ్రద్ధగా విన్నారు. వాళ్ళకీ ఊరు వచ్చినప్పటినుంచి ఆ బేరేజిని ప్రకాశంబేరేజి అంటారని తెలుసుగాని, ఆయనెవరో, ఎందుకు ఆ అడ్డకట్టకి ఆయన పేరు పెట్టారో తెలియదు.

ఆ తరువాత రాజీవ్‌గాంధీ పార్క్‌కి వెళ్ళారు. కృష్ణ ఒడ్డునే వున్న ఆ పార్కు రమకి శేఖర్‌కి చాలా నచ్చింది. సుబ్బారావు అక్కడున్న డాన్సింగ్ ఫౌంటెన్ గురించి చెప్పి చీకటి పడ్డాక వేస్తారన్నాడు.

"ఆటువంటిది మా బృందావన్ గార్డెన్‌లో కూడా ఉంది" అంది రమ.

"అయితే అది వేసే వరకు మనం ఆగక్కర్లేదు" అన్నాడు రాజు..

"వచ్చాం కదా చూసే పోదాం" అన్నాడు రామారావు. ఏ ఊరి వారికైనా అతిథులకి చూపించేందుకు ఓ స్టార్ ఎట్రాక్షన్ ఉంటుంది. అతిథులు దాన్ని ఉత్సాహంగా చూస్తామనకపోతే ఆ ఊరివారు హతాశులవుతారని రామారావుకి తెలుసు. అందరు కూల్‌డ్రింక్స్ తాగారు. ఆపైన రాజీవ్‌గాంధీ పార్క్ అంతా పిల్లలు కలియతిరిగారు. అప్పుడే యౌవనంలోకి అడుగుపెడ్తున్న శేఖర్‌కి రాణిపట్ల, రాజుకి రమ పట్ల పసి ప్రేమ లేక ఓ చిన్న ఆకర్షణతో కూడిన కుతూహలం వల్ల ఆ తిరగటం వాళ్ళకి చాలా నచ్చింది. వీళ్ళు తిరిగి వచ్చేవరకు పెద్దవాళ్ళు ఓ చోట చతికిల పడ్డారు.

తిరిగి వెళ్తుంటే "విజయవాడలో అందమైన సీనిక్‌స్పాట్స్ కూడా ఉన్నాయి" అంది

రమ.

"మా ఊరంటే ఏమిటనుకున్నావ్" అన్నాడు రాజు.

"మేము పొద్దున్న బారులుతీర్చి కూర్చున్న మనుషుల్ని చూసి వుయ్ థాట్ డిఫరెంట్లీ" అన్నాడు శేఖర్.

అతను అప్పుడప్పుడు మాటల్లో ఇంగ్లీషు దొర్లించటం రాజుకిబ్బందిగా వుంది. రాజు ప్లస్‌టూలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. అంటే శేఖర్‌కంటే ఒక క్లాసు ఎక్కువే చదువుతున్నాడు. అయినా రాజు ధైర్యంగా ఇంగ్లీషు మాట్లాడలేడు.

తిరుగు ప్రయాణంలో రాజు తను ఎమ్‌సెట్ వ్రాస్తున్నట్టు చెప్పాడు. శేఖర్ తను జె.ఇ.ఇ. వ్రాస్తున్నట్టు ఎందుకైనా మంచిదని కర్నాటక ఎంట్రన్స్ కూడా వ్రాస్తున్నానని చెప్పాడు.

"నేను కర్నాటకాది కూడా వ్రాస్తానీఏడాది సేఫ్టీ కోసం" అన్నాడు రాజు.

"వచ్చి మా ఇంట్లో ఉండి వ్రాయి" అన్నాడు రామారావు.

"మా ట్యుటోరియల్ కాలేజీవాళ్ళే వ్రాసేందుకు తీసుకు వెళ్తారు. అందరూ ఎక్కడ వుంటే అక్కడ వుండాలి" అన్నాడు.

"పరీక్ష అయ్యాక చూడ్డానికి వస్తాడులే" అంది లక్ష్మి.

ఇంటికి వచ్చి భోం చేశాక లక్ష్మి పక్కల ఏర్పాట్లలోకి దిగింది.

"తమ్ముడు! నువ్వు, బావగారు ఆ గదిలో పడుకోండి" అంటూ తమ బెడ్‌రూమ్ చూపించింది.

రాణి గదిలో రమకి రాజు గదిలో శేఖర్‌కి మడతమంచాలు వేసింది. తనకి సీతకి హాల్లో చాపలు పరిచి పరుపులు వేసింది.

రాజు ఆ రోజంతా చుట్టాలతో తిరగటంవల్ల తనకి చదువు కుదర లేదని రాత్రయినా చదువుకోవాలని తనకి రూమ్‌లో మరో మనిషుంటే గట్టిగా చదువుకోడం కుదరదని తనకి నామోషి అని చెప్పి చూశాడు. లక్ష్మి "రెండ్రోజులు సర్దుకో" అంది.

"నాకు మంచి రాంకు రాకపోతే ఎన్.ఆర్.ఐ. సీటుకి మూడు లక్షలు కట్టాల్సి వస్తుంది. అప్పుడు తెలుస్తుంది మీకు. సరిగ్గా చదివావు కావు అనకండి. అయినా మావయ్యా వాళ్ళు వచ్చే సంవత్సరమో నా పరీక్షలు అయ్యాకో రావచ్చుకదా!" అన్నాడు రాజు.

రాజు అన్న మాటలు నెమ్మదిగానే అన్నా లోపల చర్చ జరుగుతున్న విషయం రామారావుకి అర్థమైంది. రాజు అయిష్టత కూడా చూచాయగా అర్థమౌతుంది.

రామారావు అలోచనలో పడ్డాడు. పై సంవత్సరం ప్రయాణాలకి శేఖర్ పరీక్షల దృష్ట్యా తను కుదరదు అనుకొన్నాడు. వేసవికాలం ఎండలవల్ల కుదరదు. తను తన వీలు చూసుకున్నాడే కాని లక్ష్మి వాళ్ళకి ఇబ్బందేమో అని ఆలోచించలేదా? ఆలోచించకపోవడమేమిటి? "మీ వీలు తెలియజేయండి" అని లక్ష్మికి ఉత్తరం కూడా వ్రాశాడు. అని సమర్థించుకున్నాడు

రామారావు. కాని మన దేశంలో "మాకు ఇబ్బంది, రావద్దు" అని ఎంత దగ్గర వాళ్ళకైనా వ్రాయగల పరిస్థితులు లేవని ఆ క్షణంలో అతనికి గుర్తు రాలేదు.

శేఖర్‌కి కూడా దుప్పటి పరచిన మడత మంచంమీద పడుకోవాల్సి రావడం, ఆ గదిలో తను పడుకోడం రాజుకి అంత ఇష్టం లేదన్న విషయం కొద్దిగాఅర్థమవంటంతో మా ఇంట్లో నా గదిలో ఒక్కడ్నీ కర్లాన్ పరుపు వేసిన మంచం మీద పడుకొంటాను. ఇక్కడిలా పడుకోవాల్సి వచ్చింది" అని మనసులో గునుస్తూ పడుకున్నాడు. రమ చిన్నది. అమె మంచం చూడగానే పడుకుని నిద్దర పోయింది.

ఆ రోజు ఎనిమిది మందికి బేరేజ్‌కి బస్సులోను అక్కడ్నుంచి రాజీవ్‌గాంధీ పార్క్‌కి రిక్షాలోను, న్యూ బస్‌స్టాండ్ నుంచి ఇంటికి బస్సులోను ప్రయాణించడానికి, కూల్ డ్రింక్స్‌కి, తన భర్త నూరు రూపాయల దాకా ఖర్చుచేసినట్టు సీత అంచనా వేసింది. ఆడపడుచు భర్త రాజీవ్‌గాంధీ పార్క్ లోపలకి పోవటానికి పదహారు రూపాయలు ఖర్చు చేశాడు. ఇంకా తాము అమరావతి మంగళగిరి చూడాలనుకొంటున్నారు. తాము విడిగా వెళ్ళి చూస్తే నయం. ఆ విషయం సీత మర్నాడు భర్తకు చెప్పాలని అనుకొంటూ పడుకుంది.

మర్నాడు రామారావు "ఇవాళ మేం మంగళగిరి వెళ్ళి వస్తాం" అన్నాడు. "మనం వెళ్దాం అనలేదు, అక్కగారితో అలా అనవద్దని సీత అతనితో చెప్పనే చెప్పింది. " లక్ష్మి వెంటనే " మంగళగిరి, అమరావతి మేము చూసినవే చాల సార్లు. మీరు వెళ్ళిరండి" అంది వచ్చిన చుట్టాలు వాళ్ళంత వాళ్ళు బయటకి వెళ్తే ఇంట్లో చేసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయి మరి.

ఆ రెండ్రోజులు రామారావు కుటుంబం విడిగా తిరిగారు. అవసరమైనప్పుడు టాక్సీలో తిరిగారు. దాహం వేసినప్పుడల్లా కూల్ డ్రింక్స్ తాగారు. నచ్చిన వన్నీ కొనుక్కు తిన్నారు. 'రెండో కుటుంబం-కూడా వుంటే ఎంత ఖర్చు? రెట్టింపు ఖర్చు! ఒక టాక్సీ దొరకటమే కష్టమైంది ఒక చోట. రెండు కావాలంటే దొరికేవా?" సీతకి తమ కుటుంబం మాత్రమే విడిగా తిరగటం చాలా నచ్చింది. ఆడపడుచు కుటుంబం రాకపోవటంవల్ల జరిగిన పొదుపుతో కొండపల్లి బొమ్మలు గుంటూరు చీర కొనుక్కుంది.

లక్ష్మి కూడా పిళ్ళు ఆడించుకొంది. పప్పులు రుబ్బించుకుంది. కూరలు కొనుక్కుంది. భర్తతో వెళ్ళి తమ గృహ ప్రవేశానికి రాలేక పోయి ఇప్పుడు వచ్చిన తమ్ముడికి అతని కుటుంబానికి బట్టలు కొంది.

రాజు రెండు పగళ్లు నిశ్శబ్దంగా వుండేసరికి అప్పుడు చదివేసుకొని రాత్రి వాళ్ళు వచ్చేసరికి తీరుబాటు చేసుకోగలిగాడు. పిల్లలు నలుగురు డాబులు చెప్పుకోవడానికి కావలసినంత సమయం సందర్భం కుదిరాయి. ఎవరి మటుకు వాళ్ళు వాళ్ళ అమ్మా నాన్నలకి వాళ్ళంటే ఎంత ముద్దో, తలిదండ్రుల చేత తామెన్ని కొనిపించుకొన్నారో. తామెన్ని ఊళ్ళు తిరిగారో, ఎంతెంత ఖరీదైన హోటళ్ళలో తిన్నారో చెప్పుకొన్నారు.

రామారావు కుటుంబం విడిగా వెళ్ళటం రామారావు కుటుంబ సభ్యులకే కాక లక్ష్మికుటుంబ సభ్యులకి కూడా చాలా వీలైంది.

చూడాలనుకున్న వన్నీ ఛూసే సరికి తిరిగి ప్రయాణంచేసే రోజు ఒక్క రోజులో పడింది. అలసటతో పగలంతా రామారావు కుటుంబం ఇల్లు కదల లేదు. పిల్లలు కూడా మరుసటి రోజే ప్రయాణం అవటంవల్ల కొద్ది రోజులు కలిసి వుండటంవల్ల ఏర్పడ్డ చనువువల్ల నలుగురు ఒకళ్ళ నొకళ్ళు అంటి పెట్టుకునే వున్నారు. ఇంట్లోనే సినిమా కబుర్లు, క్రికెట్ కబుర్లు చెప్పుకున్నారు.

సరిగ్గా ఆ సమయంలో రాణి "మా ఊళ్ళో మమత అని హోటలుంది. దానికి చాలా అంతస్థులున్నాయి. అన్నింటికంటే పైన ఓ బార్ ఎటాచ్‌డ్ రెస్టారెంట్ వుంది. దానికన్నీ అద్దాల తలుపులే.అక్కడ్నుంచి చూస్తే ఊరంతా కనిపిస్తుంది. మేము రెండు సార్లు వెళ్ళాం" అని అంది.

"రాత్రిపూట కృష్ణానదిని, బేరేజ్‌ని లైట్లలో చూడాలి.ఇటువైపు కనకదుర్గ కొండ. భలే ఉంటుంది" అని ఒక వైపు హోటలు అందాన్ని మరో వైపు విజయవాడ అందాన్ని పొగిడాడు రాజు.

"ఇవాళ సాయంత్రం అయితే అక్కడకి వెళ్దాం" అన్నారు రమ శేఖర్ ఉత్సాహంగా.

వెళ్దాం అనలేదు రామారావు.

"నాన్నా! చూపిద్దాం నాన్నా!" అంది రాణి తండ్రితో. వచ్చిన అతిథుల కది చూపించి వాళ్ళ మెప్పు పొందాలనే కోరిక.

చూపిద్దాం అనలేదు సుబ్బారావు.

కాని సాయంత్రం తప్పనిసరిగా రామారావు, సుబ్బారావు కుటుంబాల్ని తీసుకొని బయల్దేరారు.

లిఫ్టులో హోటలు చివరి అంతస్థుకి చేరి అక్కడ డాబా మీద నిలబడి లైట్ల వెలుగులో వెలిగిపోతున్న విజయవాడని చూసి 'పచ్చి' నీటిగాలి చల్లదనం అనుభవించారు.

"మడిసన్నాక కాస్తంత కలా పోసనుండాల" అన్నాడు తన్మయత్వంలో రామారావు.

కాస్సేపున్నాక "కలాపోసనైపోతే త్వరగా తిని ఇంటికిపోయి తొంగుందాం" అన్నాడు సుబ్బారావు. అందరూ నవ్వుకొంటూ రెస్టారెంట్లోకి నడిచారు.

పిల్లలు పోటీలుపడి ఆర్డర్లిచ్చారు. టొమేటా సూప్‌లు, బటర్ నాన్‌లు, వెజిటబుల్ కర్రీలు ఐస్‌క్రీములు కడుపునిండా పట్టించారు బిల్లు వచ్చింది.రామారావు బిల్లు తీసుకోబోయాడు. సుబ్బారావు అడ్డుపడ్డాడు. రామారావు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆ బిల్లు కనీసం నాలుగు వందలై వుంటుంది. అది చెల్లిస్తే అతను బెంగుళూరు చేరటానికి డబ్బు చాలదు. బావగారిదగ్గర అప్పు చెయ్యాల్సి వచ్చేది. సుబ్బారావే బిల్లు తీసుకోవడంతో

రామారావు తేలికపడ్డాడు.

సుబ్బారావు బిల్లు తీసుకొన్నాడేగాని అందులో అంకె చూసి ఇబ్బంది పడ్డాడు. భార్యని "నీ పర్సు తెచ్చావా?" అని అడిగాడు.

"లేదు" అంది లక్ష్మి.

"ఏమోయ్! రామారావు. నీ దగ్గరో వందుంటే ఇయ్యి. ఇంటికి వెళ్ళాక ఇస్తాను" అని మొహమాటంగానే బావమరిది దగ్గర చెయ్యి చాచాడు.

"ఎంతైంది? లెట్ మీ షేర్ ఇట్" అంటూ బిల్లు చూసి రెండు నూరు రూపాయల నోట్లు పళ్ళెంలో పెట్టాడు రామారావు. మిగిలినదీ, టిప్పూ సుబ్బారావు చెల్లించాడు.

"ఇంటికి వెళ్ళగానే ఇస్తాను" అన్నాడు మరోసారి.

"అవసరం లేదు" అన్నాడు రామారావు మనస్ఫూర్తిగా. పూర్తి బిల్లు చెల్లించాల్సిన ఇబ్బందికరమైన పరిస్థితిలో తను పడనందుకు సంతోషిస్తూ.

అక్కడ్నుంచి ఆటోలు చేసుకుని ఇంటికి వెళ్ళారు. ఆటో ఛార్జీలు రామారావే పెట్టాడు.

ఆ మర్నాడు తమ్ముడు కుటుంబం బయల్దేర్తుంటే లక్ష్మి, సుబ్బారావు అందరికీ బట్టలు పెట్టారు.

మద్రాసు నుంచి బెంగుళూరు వెళ్తున్న రైల్లో మర్నాడు"మనమే వాళ్ళ మీద ఎక్కువ ఖర్చు పెట్టినట్టున్నాం కద!" అంది సీత.

రామారావు మనస్సు కలుక్కుమంది. ఎందుకని ఈ చుట్టపు చూపులు ఇరు పక్షాల వారికి భారంగా తయారవుతున్నాయి? అని ఆలోచనలో పడ్డాడు.

బహుశః తన చిన్నప్పుడు చుట్టాల రాకపోకల్లో ఇంట్లో వున్న వస్తువు, వంట్లో వున్న శక్తి వ్యయం అయ్యేవి. ఇప్పుడు ప్రతీది డబ్బుతో ముడిపడి వుండటం వ్యష్టి కుటుంబాల్లో అందరూ డబ్బుతో కొనగలిగిన సుఖాలకి అలవాటు పడటం, సమిష్టి మీద ఆ ఖర్చు ఏ ఒక్కరూ భరించలేక పోవడం కారణాలా! ఈ ఎలుకల పందాల రోజుల్లో పిల్లలకి చదువుకోడానికి ఏర్పాటుగా వేరే గదులు, ట్యూషన్లు ప్రవేశ పరీక్షా విధానాలు వీటి ఖర్చులు మధ్య తరగతి నడుం విరగ్గొడ్తున్నాయా! అక్క బహుశ చుట్టాలు వచ్చినప్పుడు ఖరీదైన హోటళ్ళ ప్రోగ్రామ్స్ పెట్టద్దని పిల్లల్ని కేకలు వేసి వుంటుంది ఈపాటికి. చిన్నతనంలో మేనత్త వేసిన వెన్న ముద్దల రుచి హోటల్లో బటర్ నాన్లకి ఎందుకు లేదు!

"లేదు సీతా! వాళ్ళు మనకి బట్టలు పెట్టారు కదా! పాపం వాళ్ళకే ఎక్కువ ఖర్చయి వుంటుంది" అన్నాడు రామారావు అతన్నుంచి సమాధానం ఆశిస్తూ చూస్తున్న సీతతో. ●

( ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక జనవరి '95 )